
ఆర్థిక పరిస్థితులని నైతిక విలువలతో సమన్వయించే క్రమంలో శీలం పాత్ర...



# శీలం

## శివకుమార్

నౌఖండ్-సుజుకి మా రమేష్‌గాడు తాత్కాలికంగా బసచేసిన ఫ్లాట్‌లోకి దూసుకుపోయింది. వాడు వాకిట్లోనే కూర్చుని నా గురించి చాలా సీరియస్‌గా ఎదురు చూస్తున్నాడనే విషయం అర్థమైంది. వాడు నా బెస్ట్ ఫ్రెండ్. ఎంత బెస్ట్ ఫ్రెండంటే ఒకే గ్లాసులో మందూ చాలా మందితో పొందూ ఆఫ్‌కోర్స్... అది విడివిడిగానే అనుకోండి. చాలాసార్లు చేశాం. మా ఇద్దరికీ వున్న ఈ వెధవ అలవాట్లే మమ్మల్నిద్దర్నీ దగ్గర చేశాయేమోనని నా అనుమానం.

నన్ను చూడగానే కేంద్రం మీద విరుచుకుపడే ప్రాంతీయ పార్టీ నాయకుడిగా 'గంటనగా ఫోన్ చేస్తే ఇప్పుడా రావడం' అన్నాడు మండిపడుతూ.

'తగ్గరా తగ్గు... ఆఫీసులో పర్మిషన్ తీసుకు రావాలిగా...' అన్నాను బండి పార్క్ చేస్తూ.......

'రా... నీతో అర్జంట్‌గా మాట్లాడాలి' అన్నాడు లోపలికి దారితీస్తూ.

అంత అర్జంట్‌గా మాట్లాడాలనుకున్నాడంటే వీడేదో ఏర్పాట్లో వున్నాడన్న మాట. అసలే మా ఆవిడ ఊళ్లో లేదేమో నరాలు లాగేస్తున్నాయి. ఏదో తెలియని ఉత్సాహం వచ్చేసింది. వాడితో లోపలికి వెళ్లాను.

నే వెళ్ళేటప్పటికి నేను అనుకున్నట్టే సోడాలు, విస్కీ బాటిల్, జీడిపప్పూ వగైరా వగైరాలు సాక్షాత్కరించాయి. అయితే వాటిని అందించే గాజుల చెయ్యి కనబడుతుందేమోనని నా ఎక్స్‌రే కళ్లు పరిశీలించాయి.

ఎక్కడా కనపడలేదు.

నాకు సగం నీరసం వచ్చినట్లయింది.

వెధవ. సగం ఏర్పాట్లే చేశాడనుకుని నాకు మండిపోయింది. ఎందుకంటే వాడు విజయవాడ నుంచి ఎప్పుడు మద్రాసు వచ్చినా ఈ ఏర్పాట్లు అన్నీ వుండి తీరాలి. అలాంటిది ఈ రోజు అసలైంది మిస్సయిందే అనుకుంటూ కూర్చున్నాను.

'నువ్వు అర్జంటుగా హెల్ప్ చెయ్యాలిరా' అన్నాడు విస్కీ గ్లాసులో పోస్తూ.

పోసే శ్రమవాడికి కల్గించడం ఎందు కని అని నేను పోశాను.

అయితే వాడు నన్ను హెల్ప్ అడిగాడు. అదేవిటో నాకు అర్థం కాలేదు. ఎందుకంటే వాడు ఎరేంజ్ చేస్తే ఎంజాయ్ చెయ్యడం తప్ప మిగతావి మనకి వాతకాదు. దుర్యోధనుడితో స్నేహం చేసిన కర్ణుడిలా కోపరేట్ చెయ్యడమే మన పని. కర్ణుడుతో నన్ను నేను పోల్చుకోవడం అన్యాయం అని నాకు తెల్సు. అయినా ఆత్మగౌరవం వున్న ఆంధ్రుడిగా సిప్ చేయడం మొదలు పెట్టాను. వాడి మాట వినిపించుకోనట్టు.

వాడిలో అసహనం పెరిగింది.

'మంగళగిరి పానకాల స్వామి పానకం తాగినట్టు విస్కీ తాగుతున్నావు. అసలు నే చెప్పింది వినబడిందా...' అన్నాడు వాడు సీరియస్‌గా.

'వినబడింది. నాకు చెవుడు లేదు. కావాలంటే ఇయర్ స్పెషలిస్ట్ నుంచి సర్టిఫికెట్ తెచ్చి చూపిస్తాను' అన్నాను తాపీగా రెండో పెగ్ పోసుకుంటూ.

'నీ బొంద. వెధవ జోకులు వెయ్యకు. విషయంలోకి రా' అన్నాడు.

నేను వాడి మాట పట్టించుకోనట్టు నా గ్లాసులో సోడా పోసుకుని గటగటా తాగేశాను. 'ఆ... ఇప్పుడు చెప్పు' అన్నాను మూడో పెగ్గు పోసుకుంటూ...

'ఇప్పటికి నిన్ను మూడుసార్లు అడిగాను. నాకు హెల్ప్ చెయ్యాలి అని, పట్టనట్టు కూర్చున్నావు' అన్నాడు వాడు.

'చూడు. ఫ్రీగా వస్తే ఫినాయిలన్నా తాగమన్నాడు మా నాన్న. అందులో నువ్వు విస్కీ పోశావు. తాగుతున్నాను. నువ్వు చేసిన ఈ సగం ఏర్పాట్ల ఆర్థిక మంత్రి అసెంబ్లీకి సమర్పించిన లో బడ్జెట్‌లా వున్నాయి. ప్రస్తుతం ప్రతిపక్ష పార్టీ నాయకుడి ఫీలింగులో వున్నాను. అదీ కాక నువ్వు ఏర్పాట్లు చేస్తే అది నా ఘనతలా ఆనందం అనుభవించెయ్యడం తప్ప నేనెప్పుడూ నీకు హెల్ప్ చెయ్యలేదు. అలాంటిది నువ్వు నా నుంచి ఏ హెల్ప్ అడుగుతున్నావో నాకు అర్థంకావడం లేదు' అన్నాను. రెండు పెగ్గులు అప్పటికి పూర్తయ్యాయి కదా... నాలో నిజాయితీ నిప్పులాంటి మనిషి సినిమాలో ఎన్టీ రామారావుగారి పాత్ర కంటె స్ట్రాంగ్‌గావచ్చేసింది.

'ఏం లేదురా. ఈ ఇంటి ఓనరు పైన వుంటున్నాడు. వాడి భార్య ఓ స్టన్నింగ్ బ్యూటీ... వాడా ఊళ్లో లేడు. ఇవాళ ఇక్కడ ఎవరూ రారు. ఏం చెయ్యాలో తెలియక కొట్టుకుంటుంటే నువ్వు గుర్తొచ్చావు. మనం ధైర్యం చేస్తే స్వర్గం మన ముందున్నట్టే' వాడు చాలా సూటిగా విషయం చెప్పేశాడు.

'తప్పురా... పెళ్లియిన అమ్మాయితో... ఇదీ కాక ఊరుకాని ఊరు. ఎవరికన్నా తెలిస్తే మక్కెలిరగ కొడతారు' అన్నాను మూడో పెగ్గు బిగిస్తూ.

'హోర్మ్మయ్. వెధవనీతులు చెప్పకు. ఆవిడ నాకు నచ్చింది. నేను ఆవిడకు నచ్చాను. ఎలా పిలవాలి. అదే సమస్య. దానికి నువ్వు హెల్ప్ చెయ్యి' అన్నాడు మందు తాగుతూ.

'పళ్ల రాలగొడతాను. నీ తరువున నన్ను అడగమంటావా' అన్నాను నాలుగో పెగ్ పోసుకుంటూ.

'ఛీఛీ... నువ్వేమన్నా బ్రోకరు గాడి విరా... నా ఫ్రెండ్‌వి. నాకు సలహా ఇవ్వరా... అన్నాడు వాడు ప్రాధేయపడుతూ.

వాడికి హెల్ప్ చెయ్యాలనిపించింది. వాడికేసి చూసి 'ఇది చాలా సింపుల్ రా... ఆవిడ నీకు నచ్చింది. నువు ఆవిడకు నచ్చావు. ఇక్కడా ఎవరూ లేరు. నేమన్నా ధృతరాష్ట్ర మహారాజులా కూర్చుంటాను'' అన్నాను. నాకు మందు ఎక్కడం ప్రారంభించింది.

'ఏడిశావ్. ఈ పాటి వెధవ ఆలోచన నాకు రాక కాదు నిన్ను రమ్మంది. ఆవిడ తమిళం. నేను తెలుగు. నా భాష ఆవిడకు రాదు. ఆవిడ భాష నాకు రాదు. అందుకు ఫోన్ వున్నా పైకి ఫోన్ చెయ్యలేక నీ కోసం వెయిట్ చేస్తున్నాను' అన్నాడు వాడు.

'ఇప్పుడు నన్నేం చెయ్యమంటావ్...'

'ఫోన్‌లో ఆవిడతో ఇక్కడికి రమ్మను చెప్పాలి. అలా తమిళంలో ఏవంటారో నువ్వు రాసియ్యి. నేను ఫోన్ చేసి చిలకలా చెప్పి పిలుస్తాను అన్నాడు.

'అది సాధ్యమయ్యే పనేరా... ముప్పయి రోజుల్లో తమిళ భాష పుస్తకం కొనుక్కున్నా నెల పడుతుందే... ముప్పయి నిమిషాల్లో నువ్వు ఎలా చెప్పగలవు' అన్నాను నేను. నాకు మందు బాగా పని చేస్తోంది.

'నోరుముయ్యి. తెలుగు అక్షరం ముక్క రాకుండా ఇతర భాషల ఆడవాళ్లు తెలుగు సినిమాల్లో చిలకల్లా చెపుతూ లక్షలు లక్షలు సంపాదిస్తున్నారు. అలాంటిది ఈ స్టన్నింగ్ బ్యూటీ కోసం నేనా మాత్రం కష్టపడలేనా అన్నాడువాడు. వాడికీ మందు బాగానే పనిచేస్తున్నట్టు వుంది.

వెరీ గుడ్ ధైర్యే సాహసే లక్ష్మీ... కానీ... ఫోన్ చెయ్యి అన్నాను నేను.

'నువ్వు ముందు రాయరా...' అన్నాడు వాడు.

'ముందు నువ్వు చెయ్యి... ఎంత సేపు రాస్తాను...'అన్నాను నేను.

నిజానికి నాకు అంత ధైర్యం లేదు. అది మందు మహత్యం...

వాడు డయల్ చేసేశాడు.

అవతల రింగ్ అయింది...

'హల్లో...యారుంగ...(హల్లో-ఎవరండీ...) అంది అవతల కంఠం. ఆ కంఠం. ఫోన్‌లోంచి బయటకు వినపడుతోంది. అది కోయిల కూతలా వుంది. కంఠమే ఇంత అందంగా వుంటే మనిషి ఎంత అందంగా వుంటుందో అనుకుంటూ నేను కాయితం మీద మావాడికి నేను రాసి ఇచ్చెయ్యసాగాను.

నాన్‌దా...(నేనే) అన్నాడు మావాడు.

నాన్‌దా అన్‌న... యారుంగ...' (నేనే అంటే...ఎవరండీ... అంది అవతల కంఠం.

కాల్ లే పొత్తేనే...నాన్ దా... (ఉదయం చూశానే...నేనే) మావాడు ఏకాగ్రతతో తమిళం మాతృభాషలా ఫీలయిపోతూ చెప్పేస్తున్నాడు.

నీంగళా...ఎన్‌న...(మీరా...ఏంటి) అంది అవతల కంఠం.

ఇంగెయారు ఇల్లయ్...నా ఒరే ఆళు ఇంకె రేన్...వాంగ...(ఇక్కడ ఎవరూ లేరు. నేను ఒక్కడ్నే వున్నాను. రండి) అన్నాడు వాడు.

"ఎదుక్కు?"...(ఎందుకు) అంది అవతలి కంఠం చిలిపిగా...అలా అనడంలో మావాడు ఆ అమ్మాయిని చూపులతో ఎంత లైన్లో పెట్టేశాడో నాకు అర్థమైంది. ఆ అమ్మాయి ఫోన్‌లో మాట మైకంలో మాట్లాడినట్టు ఫోన్‌కు రెండు అడుగుల దూరంలో వున్న నాకు వినిపిస్తోంది.

"ఎదుక్కా ఉంగళక్కు తెరియుదా" (ఎందుకో మీకు తెలియదా) నేను రాయడం వాడు చెప్పడం చకచకా జరిగిపోతున్నాయి.

ఆమె నవ్వింది...ఫోన్ పెట్టేసింది. మా వాడిలో నిరుత్సాహం లోనపడింది.' ఫోన్ పెట్టేసిందిరా...' అన్నాడు.

'నన్నేం చెయ్యమంటావు' అన్నాను మరో పెగ్గు పోసుకుంటూ.

నీ వెధవ తాగుడూ నువ్వే తప్ప నా విషయం ఆలోచించవు కదా అన్నాడు వాడు విసుగ్గా.

బెల్ మ్రోగింది.

ఇద్దరం వెలుపలికి వచ్చాం.

హాల్లో పై ఇంటావిడ, ఆమె ప్రక్కన మరో అమ్మాయి. బహుశా వాళ్ల పని పిల్ల అయి వుంటుంది- వాళ్ళు వచ్చారు.

నాకు మతి పోయింది. ఇది సాధ్యమా... ఆ ఇల్లే ముప్పయి లక్షలు చేస్తుంది. ఆమె భర్తకు కోటి రూపాయిలకు పైగా ప్రాపర్టీ వుండి వుంటుంది. అలాంటిది ఫోన్‌లో మందు కొట్టి అర్థం లేని ప్రయత్నం చేస్తే తప్పు చెయ్యడానికి వచ్చింది.

అయితే నన్ను చూసి తెల్లబోయింది. ఎందుకంటే ఫోన్‌లోఎవరూ లేరని మా వాడు చెప్పాడు కదా...ఆమె అవస్థ గమనించి నేను

"తప్పానినక్కాదింగ...ఎన్ నన్ బరకుత తమిళం తెరియాదు. అదుక్కా హో నాన్ ఉదలిసెయిదేన్ (తప్పుగా అనుకోవద్దు. నా స్నేహితుడికి తమిళం తెలియదు. నేను సహాయం చేశాను) అని చెప్పాను.

ఆమె నవ్వింది.

మా వాడు చెప్పినంత స్టన్నింగ్ బ్యూటీ కాదు కాని అందగత్తే. అందులో సందేహం లేదు.

'మావాడు ఆమె చెయ్యి పట్టుకుని గది లోకి లాక్కుపోయాడు. ఆ పని పిల్లా, నేను మిగిలిపోయాం. వాడి కౌగిట్లో ఆ సుందరాంగి నలిగిపోతూ వుంటుంది అనుకుంటూ ఆ పనిపిల్లకేసి చూశాను.

ఆ పనిపిల్లనువశం చేసుకోవడం పెద్ద కష్టమైన పనేం కాదు అనుకుంటూ చెయ్యి వేశాను.

ఆమె సూటిగా చూసింది ఏమిటన్నట్లు?

నేను చాలా తేలిగ్గా 'పొతాచ్ ఇల్లయా... ఉంగమొదలాలి మనెలియే ఎన్‌నన్ బర్‌రోడ సంతోషమా ఇరుందాచి. సమరెండ్ పేరుకు అప్పడియే ఇరకావాన్ః (చూశావుగా. నీ యజమాని భార్యే నా స్నేహితుడితో సంతోషంగా వుంది. అలాగే మనం ఇద్దరం సంతోషంగా వుందాం...అన్నాను ఆమెను దగ్గరకు లాక్కోవాలని ప్రయత్నం చేస్తూ.)

ఆమె నా చెయ్యి విదిలించి కొట్టింది. నేను ఊహించినట్టు తమిళంలో కాక తెలుగులో చెప్పింది. 'నేను దానిదగ్గర పని చేస్తున్న పాపానికి నేను దాంతో వచ్చాను. అది దేవుడులాంటి భర్తకు అన్యాయం చేస్తున్నా దాని లాగా నేను కాలేను. మరోసారి ఈ ప్రయత్నం చేస్తే చెప్పు తీసుకు కొడతాను' అంది గిరుక్కున వెను దిరిగి వెళ్ళిపోతూ...

నాకు మొత్తం తాగింది క్షణంలో దిగిపోయింది.

'శీలం' ఎక్కడ వుంటుందో ఎవరూ చెప్పలేరన్న జ్ఞానం కలిగింది.

"నూరు అబద్ధాలాడి ఒక పెళ్ళి చేయమన్నారు. కాని, నేను ఒకే అబద్ధం ఆడి పెళ్ళి చేశా"

"ఏంటది?"

"అబ్బాయికి తల్లి లేదని చెప్పా."

పద్మశ్రీ (మాణిక్యారం)


రచయిత చిరునామా:
వి.ఎస్. శివకుమార్
నెం.4, నాగార్జుననగర్,
ఫస్ట్ స్ట్రీట్, కోడంబాకం,
మద్రాసు 600 024


# చర్చావేదిక

## అస్పష్టతకూ హద్దు ఉంది

"జీవితం ఎంతకీ తరగని స్వయం జ్వలిత హారతి కర్పూరం" — అని జీవితం గురించి చండీదాస్‌గారన్నట్టు - కవిత్వం కూడా జీవితంలాగే జీవిస్తుంది. ఇంకా చెప్పాలంటే ఒకవేళ జీవనం ముగిసినా కవిత్వం మాత్రం వుంటుంది, ముగిసిన జీవనంలోంచి ప్రారంభంకాబడే మాత్న కవిత్వంలా. అందువల్ల కవిత్వానికి కాలం చెల్లిపోదు కాని ఆ సందేహం వచ్చిందంటే కవిత్వం అంటే వెగటు పుట్టిస్తున్నారన్న మాట. స్వచ్ఛమైన భావానికి చావు లేదు. అది గతిశీలకమైనది. ఒకదాంట్లోంచి మరొకటి ఉత్పన్నం అవుతుంది. అందువల్ల భావం నిరంతరం మార్పులు చెందుతూ అమరత్వం పొందుతుంది. ఈ భావ వ్యక్తీకరణలో తీవ్ర అసంతృప్తి కలగడం వల్ల కవిత్వం అంటే విముఖత కలుగుతోంది. వీళ్ళేదో జిమ్మిక్స్ చేసి చంపుతున్నారన్నమాట.

అబ్సనిటీ, సింబాలిజం ... ఇంకా ఏ ప్రయోగాలైనా శిల్పానికి సంబంధించినవే తప్ప స్వచ్ఛమైన భావానికి సంబంధించినవి కావు.

చెప్పాల్సి వచ్చినపుడు అవసరమై అస్పష్టంగా చెప్పడం వేరు కాని అస్పష్టంగానే చెప్పాలని తీర్మానించుకోవడం మాత్రం పాఠకులకి బలవంతంగా "హాఫ్‌లాల్" ఇచ్చినట్లే. అవుతుంది. అస్పష్టంగా రాసినది ప్రతీది కవిత్వం అయిపోదు. నా ఉద్దేశం —అస్పష్టత వుందని తృణీకారం కాదు. తెల్లని వెన్నెలనీ, సెలయేళ్ళ గలగలలని, మంద పవనాలకీ, స్పష్టమైన ప్రేమికుల ప్రేమకీ అస్పష్టతని అంటగట్టేస్తుండడం మంచిది కాదు. పొయ్ట్రీ ఈజ్ ది స్పాంటేనియస్ ఓవర్ ఫ్లో ఆఫ్ పవర్‌ఫుల్ ఫీలింగ్స్ - అని వర్డ్స్ వర్త్ అన్నంత మాత్రాన పిచ్చివాడి ప్రేలాపన కవిత్వం అని ఎక్కించుకోనక్కర్లేదు. ఎంత ఎత్తుకి లేచిన సాగర కెరటానికైనా ఓ హద్దూ పద్దూ వుంది. అస్పష్టతకూ హద్దు పద్దూ వుండాలి. పవర్‌ఫుల్ అంటే పాఠకుడికి ఆహ్లాదం కలిగించే మాట వాస్తవమే అయితే ... కవిత్వం అర్థంకాకపోతే సిగ్గుపడవలసిన వాడు పాఠకుడే కాని కవిత రాసిన వాడు కాదు" అని పాఠకుల్ని అవమానపరచడం సరికాదు. నిజమే, కవి బాధల్ని పాఠకుడు అర్థం చేసుకోవాలి. అంత మాత్రంచేత సందు దొరికింది కదా అని పాండిత్యాన్ని ఒంపి, సొంత డిక్షనరీలలో పాఠకుల మెదళ్ళని మోదక్కర్లేదు. విమర్శకి ప్రతి విమర్శ ఆపి, "వాడి" తగ్గించి మాడొచ్చు కదా! రామాయణ, మహాభారతాలకి ఆదరణ తగ్గిపోయిందా? "కాటి సీను" పద్యాలు వేమన పద్యాలు వల్లించడం మానేశారా? సంశయాలన్నీ నేటి కవితకే. ఇది చేజేతులా చేసుకున్నదే. అప్పటి నవలకి, ఇప్పటి నవలలకి ఎంతో మార్పు వచ్చింది. అంత మాత్రం చేత నవలలు చచ్చిపోలేదు. అప్పటి నవలలు మానసికం అయితే ఇప్పటి నవలలు భౌతిక మానసం, విజ్ఞాన మానసంగామా వున్నాయి. కవిత్వంలో కూడా రః మార్పులు అవసరం.

—తేజోమూర్తుల శేషేంద్రశర్మ